సూర్య
17వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం,22 జనవరి 2024

పెరవలి మండలంలో ప్రారంభమైన కులగణన సర్వే

-పెరవలి తాసిల్దార్ టీ.రాజరాజేశ్వరి

పెరవలి,మేజర్న్యూస్ : పెరవలి మండలంలోని అన్ని గ్రామాల్లో కులగనన సర్వే ప్రారంభమైనట్లు పెరవలి తాసిల్దార్ టీ రాజరాజేశ్వరి తెలిపారు జనవరి 20వ తేదీ శనివారం ఆమె పెరవలి తహసీల్దార్ కార్యాలయంలో మేజర్ న్యూస్‌తో మాట్లాడుతూ కులగణన సర్వే పై వివిధ అంశాలను విషయాలను వెల్లడించారు. ప్రతి గ్రామంలోనూ సర్వే చేసేటప్పుడు ప్రతి ముగ్గురు వాలంటీర్లకు ఒక సూపర్వైజర్ ఉంటారని వీరు ఒక టీం గా ఇంటింటికి వెళ్లి కులగణన సర్వే చేసి వివరాలు సేకరిస్తారని అటువంటి సమయంలో ప్రజలు వారికి సహకరించాలన్నారు ఈనెల 29 వ తేదీ వరకు పది రోజులు పాటు ఈ కులగనన సర్వే జరుగుతుందన్నారు. ఈ టీములకు మండల స్థాయి అధికారులు సూపర్వైజర్లుగా ఉంటారు అన్నారు. ఇప్పటికే ఈ గ్రామాల్లో 50% పూర్తయిందని దశలవారీగా ఈ ప్రక్రియను మండలం మొత్తం పూర్తి చేస్తామన్నారు. ఈనెల 22న ఓటర్ తుదిజాబితా విడుదల పెరవలి మండలంలోని ఓటర్‌కి సంబంధించి తుది జాబితాను ఈ నెల 22వ తేదీ సోమవారం విడుదల చేస్తున్నామని తాసిల్దార్ టీరాజరాజేశ్వరి తెలిపారు. ఈ వాటర్ జాబితాలో ఆయా గ్రామాల్లోని బిఎల్వోలుకు అందిస్తామని వాటిని పోలింగ్ కేంద్రాల వద్ద ఉంచుతారన్నారు వాటర్ లో వాటిని పరిశీలించుకుని తమ పేర్లు ఉన్నవి లేనివి సరిచూసుకోవచ్చని తప్పొప్పులను సవరించుకోవచ్చని ఆమె తెలియజేశారు. పేరు లేని వారు తప్పొప్పులు ఉన్నవారు అర్జీ చేసుకునే అవకాశం ఉందని మార్పులు చేర్పులు చేసుకోవచ్చన్నారు.

కార్మిక వర్గం విప్లవ చైతన్యాన్ని అలవర్చుకోవాలి

-అప్పుడే పాలకులకు బుద్ధి చెప్పగలము
-సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు
-కామ్రేడ్ లెనిన్‌కు ఘనంగా నివాళులర్పించిన సామర్లకోట కమ్యూనిస్టు పార్టీ..

సామర్లకోట,మేజర్న్యూస్ : కామ్రేడ్ వి.ఐ.లెనిన్ శత వర్ధంతి సందర్భంగా కార్మిక వర్గం పోరాట కర్తవ్యాలు అనే అంశంపై స్థానిక ఏఐటియుసి కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సామర్లకోటశాఖ ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించారు. దీనికి పట్టణ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి పెదిరెడ్ల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు పాల్గొని ప్రప్రదమ సోషలిస్టు రాజ్య నిర్మాత, అక్టోబర్ విప్లవ మహానాయకుడు విఐ లెనిన్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ప్రపంచ మానవాళి విముక్తికి మహోన్నత సిద్ధాంతాన్ని మార్క్స్, ఏంగెల్స్‌లు అందిస్తే దానికి అప్పటి నిర్దిష్ట పరిస్థితులలో తన ఆలోచనలను చేర్చి ఆచరణలో పెట్టి ప్రపంచంలోనే మొట్టమొదటి సామ్యవాద కలను సాకారం చేసిన మహానేత లెనిన్ అని మధు అన్నారు. లెనిన్ అనే పేరు మూడు అక్షరాలే కాని ప్రపంచ ప్రజలందరికీ విముక్తి ఆయుధపు ధ్వని అని ఆయన బతికింది యాభై నాలుగేండ్లే కావచ్చు కానీ వందేళ్ల తర్వాత కూడా ఆయన అందిం చిన విప్లవ విద్యుత్ సరఫరా అవుతూనే ఉందని ఆయన అన్నారు. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలలో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవ స్థలు సంక్షోభంలోకి పోతున్నాయని ప్రజలు పెద్దయెత్తున తమ ఇక్కట్లపై నిరసనలు తెలుపుతున్నారని వీటిని అణచేందుకు ఫాసిస్టు తరహా పాలన విస్తరి స్తోందిని అయినా చరిత్ర గమనంలో విముక్తి పథం ఆగదని లెనిన్ సజీవంగా మనకు స్ఫూర్తిని ఇస్తూనే ఉంటాడని మధు అన్నారు. ప్రపంచ భూ భాగంలో ఆరవవంతున్న సువిశాల రష్యా అధినేత అయ్యాక కూడా లెనిన్ నిరాడం బరత, వినమ్రత, నైతిక మానవీయతలతో కూడిన జీవన విధానం కొనసాగిందిని లెనిన్ మనసు, మాట, చేతలకు ఎన్నడూ తేడా కనిపించలేదుని సమసమాజపు వెలు తురు కోసం తనను కొవ్వొత్తిలా కరిగించుకున్నాడు. ఆయన ఆరోగ్యం కోసం మెరుగైన ఆహారం, వసతులు అవసరమని డాక్టర్లు మొరపెడుతున్నా, ప్రజలు హీనంగా జీవి స్తున్నపుడు వాళ్ల కన్నా మంచిగా జీవించే నైతిక హక్కు నాకు లేదని తిరస్కరించిన నేత లెనిన్ అన్నారు . లెనిన్ ఆశయాలను కార్మికవర్గం ముందుకు తీసుకు వెళ్లాలని మధు పిలుపునిచ్చారు.

వైఎస్ఆర్సిపి ఇన్చార్జిగా తలారికి బాధ్యతలు

కొవ్వూరు,మేజర్న్యూస్ : కొవ్వూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జిగా నియమించబడిన తలారి వెంకటరావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని మెరక వీధి వినాయకుని గుడి వద్ద నియోజవర్గ వైఎస్ఆర్సిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వినాయకుని గుడి, సంస్కృత పాఠశాలల్లోని శివాలయం, మసీదు, చర్చిలో పూజలు, అభిషేకాలు, ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం బస్ స్టాండ్ సెంటర్లోని అంబేద్కర్, మెరక వీధిసెంటర్లోని అంబేద్కర్,రాజశేఖర్ రెడ్డి,రంగా విగ్రహాలకు పూలమాలు వేసే నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గంలో 2019లో ఎమ్మెల్యేగా గెలుపొందానని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశానుసారంనన్నుకొవ్వూరుఇన్చార్జిగా నియమించడం జరిగిం దన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు లక్షల అరవై తొమ్మిది వేల కోట్ల రూపాయలతో రాజకీయాలకు,కులాలకు అతీతంగా అన్ని బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో 175 స్థానాలు గెలవాలని ఉద్దేశంతో స్థానిక హోమ్ మంత్రి తానేటి వనితను గోపాలపురం ఇన్చార్జిగా నన్ను కొవ్వూరు ఇన్చార్జిగా నియమించడం జరిగిందన్నారు.ఈనెల 24వ తేదీన మిథున్ రెడ్డి, జక్కంపూడి రాజా,రాజీవ్ కృష్ణ, తానేటి వనిత,నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకుల మధ్య విభేదాలు పక్కన పెట్టి తన విజయానికి అందరూ సహకరించాలని కోరారు. అనంతరం కొవ్వూరులోని వాత్సల్య వృద్ధాశ్రమంలో కొవ్వూరు నియోజకవర్గం పరిశీలకులు రాజీవ్ కృష్ణ జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేసి వృద్ధులకు పళ్ళు, దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, ఏలూరి విజయలక్ష్మి,చాగల్లు మండలం ఎంపీపీ మట్టా వీరస్వామి, జడ్పిటిసి బొంత వెంకటలక్ష్మి, వైఎస్ఆర్సిపి నాయకులు రుత్తుల భాస్కరరావు, ముదునూరి నాగరాజు,సుంకర సత్యనారాయణ, ముదునూరి సూర్యనారాయణరాజు, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర,కంటమణి రమేష్, ముళ్ళపూడి కాశి, చౌటుపల్లి వీరన్న, భావన బిన్నీ, మారిన రామకృష్ణ, వేంద్ర సూరిబాబు,మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తోటి మిత్రుడి కుటుంబానికి ఆటో యూనియన్ అండగా...

వి.ఆర్.పురం,మేజర్న్యూస్ : తోటి మిత్రుడు ఆనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందారు. ఆదివారం ఆ కుటుంబానికి ఆటో యూనియన్ డ్రైవర్లు 5000/-రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.గతంలో రేఖపల్లి ప్రభుత్వ వైద్యశాలలో మెడికల్ ఆఫీసర్ గా విధులు నిర్వహించి ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో వైద్య సేవలు అందిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుందర్ ప్రసాద్,1500/-రూపాయలు ఆర్థిక సహాయాన్ని ఇచ్చి తనకు ఈ ఏజెన్సీ ప్రాంతంపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు.2023 గోదావరి వరదల సమయంలో కూడా మెడికల్ క్యాంపులు నిర్వహించి ఎంతోమందికి ఉచితంగా మందులు అందించారు.వరద బాధితులకు నిత్యావసర సరుకుల కూడా అందించారు.ఎంతో మందికి ఆర్థికంగా వైద్య సేవలు పరంగా సహాయ సహకారాలు అందించి ఏజెన్సీ ప్రాంత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఈ ఆర్థిక సహాయం అందించిన వారిలో చీమల వెంకటేశ్వర్లు,ప్రగిళ్లు ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

టిడిపి జనసేనల ఉమ్మడి నిడదవోలు అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలి

- తెదేపా నాయకుడు కుందుల

పెరవలి,మేజర్న్యూస్ : పెరవలి మండలం కానూరు అగ్రహారం గ్రామంలో నిడదవోలు నియోజకవర్గం తెదేపా సీనియర్ నాయకుడు కుందుల వీర వెంకట సత్యనారాయణ ఆఫీసు వద్ద జనవరి 21వ తేదీ ఆదివారం జనసేన పార్టీ మరియు తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకుల ఉమ్మడి ఆత్మీయ సమావేశం జరిగింది నిడదవోలు నియోజకవర్గ టిడిపి నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది ఈ కార్యక్ర మంలో నిడదవోలు నియోజకవర్గ జనసేన పార్టీ ముఖ్య నాయ కులు,జిల్లా కమిటీ సభ్యులు,మండల స్థాయి గ్రామస్థాయిలోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు అసెంబ్లీ ఎన్నికలు అతి దగ్గరగా ఉన్న తరుణంలో జనసేన పార్టీ మరియు టిడిపి పొత్తులో ప్రకటించే నిడదవోలు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో అందరూ కలసికట్టుగా కృషిచేసి ఏకాభిప్రాయంతో ముందుకు వెళ్తూ గెలిపించుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమం లోతుల చిన్నబాబు జిల్లా కార్యదర్శి ఉలుసు సౌజన్య జిల్లా సంయుక్త కార్యదర్శి కాకర్ల నాని జిల్లా సంయుక్తకార్యదర్శి సదా వెంకటేష్ జిల్లా సంయుక్త కార్యదర్శి ఆకుల నాగేశ్వరరావు నిడదవోలు మండల అధ్యక్షులుకోల సీతయ్య ఎంపిటిసి కానూరుకోటిపల్లి మురళి ఎంపీటీసీ మల్లేశ్వరంగరిమల కొండలరావు ఉంద్రజవరం మండలం ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కుటుంబానికి అండగా ఉంటాం

- ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి

అత్రేయపురం,మేజర్న్యూస్ : అత్రేయ పురానికి చెందిన అంగ న్వాడీ టీచర్ కొత్తపల్లి శాంతికు మారి హార్ట్ ఎటాక్‌తో ఈ నెల 19వ తేదీన మరణించారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి శాంతి కుమారి కుటుంబానికి రూ.25,000 వేల ఆర్థిక సాయం అందచేసి అండగా ఉంటాం అని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతికుమారి మరణాన్ని కొందరు రాజకీయాలకు వాడుకోవాలని చూడడం బాధాకరమన్నారు.ఆ కుటుంబసభ్యులను పరామర్శిం చడం, సానుభూతి తెలపడం తప్పు కాదు కాని ప్రతీది రాజకీయం చేయడం అనేది మీ విజ్ఞతకే వదిలిపెడుతున్నామన్నారు. అంగ న్వాడీల సమస్యలు ప్రభుత్వం తండ్రి స్థానంలో ఉండి పరిష్కరిం చడానికి కృషిచేస్తున్నారని, ఇలాంటి సమయంలో ప్రతీ విషయాన్ని రాజకీయంగా వాడుకోడానికి మీరు ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముదునూరి రామరాజు, ఎంపీటీసీ సరళ ధనలక్ష్మి సత్తిపండు తదితరులు ఉన్నారు.

వెంకన్న ఆలయ అభివృద్ధికి చర్యలు

- కేంద్ర రాష్ట్ర పర్యాటకశాఖ బృందం పరిశీలన

అత్రేయపురం, మేజర్ న్యూస్ : కోనసీమ తిరుమలగా కోరిన కోర్కెలు తీర్చే దైవంగా విరాజిల్లుతున్న వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి ఆలయ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరు సత్యనారాయణరాజు లు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రం పలు పర్యాయాలు ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పర్యాటకశాఖ ముఖ్యంగా ఆధ్యాత్మిక పర్యాటక విభాగం ద్వారా వాడపల్లి క్షేత్రాన్ని అభివృద్ధి చేయుటకు ఆర్థికపరమైన మౌలికపరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారని స్పందించిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పర్యాటకశాఖవారి ఆదేశాల మేరకు శనివారం వాడపల్లి గ్రామం అంతా పరిశీలించి భక్తులకు ఎటువంటి అవసరాలు కావాలి, వాటికి ఉన్న అవకాశాలు ఏమిటి, వ్యర్థాలు ఎలా ఉపయోగించు కోవాలి అనేదానిపై క్షుణ్ణంగా పరిశీలన చేసి ఈనెల 25వ తేదీన జరగనున్న సమావేశమునకు నివేదికను అందించనున్నారు. ఈ బృందంతో ఆలయ చైర్మన్ రమేష్‌రాజు, ధర్మకర్తలు ఈ బృందానికి వాస్తవ పరిస్థితులను వివరించారు. వీటిని పరిశీలించిన తర్వాత పలు అభివృద్ధి పనులు చేయటంకు 25 కోట్ల రూపాయలకు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నామని, తదుపరి సమావేశంలో ఈ విషయాన్ని పొందుపరిచి సమర్పించడం జరుగుతుందని బృందం తెలిపారు.

ఆరోగ్య భారతి వైద్యుల ఆధ్వర్యంలో శ్రీరామ విజయ అక్షింతలు వితరణ

కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక రాంకోసా మైదానంలో ఆరోగ్య భారతి వైద్యుల ఆధ్వర్యంలో శ్రీరామ విజయ అక్షింతలు వితరణ కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. జి.ఎస్.మూర్తి మాట్లాడుతూ మన భారతీయ సంస్కృతిలో, మన జీవితాలలో రామాయణం ఒక భాగమై నిలిచిందన్నారు. డా. చిట్ల కిరణ్ మాట్లాడుతూ 500 సంవత్సరాల మన పోరాటాల ఫలితం 22వ తేదీన అయోధ్యలో జరిగే శ్రీబాలరాముని ప్రాణ ప్రతిష్ట అని, ఇది మన భారతీయులందరికీ పండుగ రోజని అన్నారు.

డా.అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీ సీతారాములవారు ప్రజలందరికీ ఆదర్శ దంపతులని, శ్రీరాముడు తండ్రి మాటను జవదాటని తనయుడిగా, సోదరులను అభిమానించిన అన్నగా, భార్య దూరమైనా నిరంతరం అమె కోసం పరితపించే భర్తగా, ప్రజల సంక్షేమం కోసమే వారి మాటకు విలువిచ్చిన రాజుగా ఎక్కడా ధర్మం తప్పకుండా మనిషి అనేవాడు ఇలా జీవించాలో చూపించినవాడు శ్రీరాముడు అన్నారు. ధర్మానికి ప్రతీక శ్రీరామచంద్రుడు. త్రేతాయుగంలో శ్రీమహావిష్ణువే లోక కల్యాణం కోసం రాముడిగా అవతరించి, దుష్ట శిక్షణ చేశాడని రామాయణం తెలుపుతుంది. తండ్రి ఇచ్చిన మాట కోసం కట్టుబడి అరణ్యాలకు వెళ్లిన రాముడు ఇప్పటికీ ఎప్పటికీ ఆదర్శ మూర్తే. రామాయణంలో రాముడి లక్షణాలు గురించి వర్ణిస్తూ షోడశ మహాగుణాలు ఆయనలో ఉన్నట్లు తెలిపారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో డా. లక్ష్మీనారాయణ, డా. చక్రపాణి, డా. రాజ్యలక్ష్మి, డా. ఉమ, డా. యు.వి.రామకృష్ణ, డా. ఆదిత్య, డా. సిరంగు దొరబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులకు డా. హర్ష, డా. ప్రసోబ్ శ్రీరామచంద్రమూర్తి పటాలను, అయోధ్య విజయ అక్షింతలను పంపిణి చేసారు.

ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఏజెన్సీ ప్రాంతాల్లో రామకృష్ణ మిషన్‌వారు అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ కోరారు. రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమండ్రి వారి అధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్టు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయ నందజీ మహారాజ్ తెలియచేసారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ దాసరి ఉమా మహేష్, డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ ఎస్. సంపత్ కుమార్ పాల్గొని సుమారు 200 మందికి వైద్య సేవలు అందించినట్టు స్వామీజీ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అవసరం అయినవారిలో 58మందికి రక్తపరీక్షలు, 7గురుకి థైరాయిడ్ పరీక్షలు, 7గురికి ఎక్స్ రేలు, 11మందికి ఫిజియోథెరపీ చేసినట్టు స్వామీజి తెలిపారు. కాగా వేమగిరి పరమహంస యోగానంద నేత్రలయం వారిచే ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కంటి వైద్య శిబిరంలో 23మందికి కంటి పరీక్షలు చేసి అయిదు గురుకి కళ్లజోళ్లు అందించారు. కంటి ఆపరేషన్ నిమిత్తం ఒకరిని వేమగిరి తరలించారు. గిరిజన ప్రాంతంలో రామకృష్ణ మిషన్ అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజి కోరారు. ఈ వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు, వారి సహాయకులకు అన్నదానం నిర్వహిం చినట్టు స్వామిజి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో మెడికల్ క్యాంప్ కో-ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, నక్కా చంటి బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ రెడ్డి అధికారం కోసం కోడి కత్తి డ్రామా

- సుంకర పావని తిరుమల కుమార్



కాకినాడ సిటీ,మేజర్ న్యూస్ : జగన్‌రెడ్డి అధికారం దక్కించుకోవడం కోసం కోడి కత్తి డ్రామాకు తెరలేపారని, దళితుడి జీవితాన్ని పణంగా పేట్టి జగన్‌రెడ్డి తన రాజకీయ ప్రయోజనం నెరవేర్చుకొ న్నాడని మాజీ మేయర్ మరియు కాకినాడ తెలుగు మహిళా అధ్యక్షురాలు సుంకర పావని తిరుమల కుమార్ విమర్శించారు. అధికారం కోసం జగన్ రెడ్డి కోడి కత్తి దాడిని వాడుకున్నాడన్నారు. తాను జగన్ రెడ్డి అభిమానినని, జగన్ రెడ్డి మైలేజ్ కోసమే దాడి చేసానని అప్పట్లో శ్రీనివాస్ చేప్పాడని గుర్తు చేశారు. వాడుకుని వదిలేయటంలో సిద్ధహస్తుడైన జగన్ రెడ్డి.... కోడి కత్తి కేసులో కుడా అమాయకుడు, పేద దళిత కుటుంబానికి చెందిన శ్రీనుని కుడా వాడుకొని వదిలేసాడని, పేదరికం, వృద్ధాప్యంలో ఉన్న తల్లితండ్రులకు కన్నీటి ఘోష మిగిల్చాడని, జగన్ రెడ్డి తన స్వార్థ ప్రయోజనాల కోసం దళితుడిని వాడుకున్న తీరు అత్యంత దారుణం అని మండిపడ్డారు.

భాదితుడైన జగన్ రెడ్డి కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాలని కోర్ట్ చెబుతున్నా, కోర్టుకు హాజరు కాకుండా మినహాయింపు ఇవ్వాలని కోర్టును కోరటం కేసును నీరుకార్చటనికి ప్రయత్నం చేయటమేనన్నారు. తన అవినీతి కేసులో కోర్టుకు వెళ్లారు, బాబయ్ హత్యకేసులో సిబిఐ డిమాండ్ చేసి, తర్వాత వద్దన్నారు, ఇప్పుడు ఆ కేసులో నిందితుల్ని కాపాడుతూ..చెల్లెలి పైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారు, కోడి కత్తి కేసులో శ్రీను బెయిల్‌పై బయటకు రాకుండా చేస్తూ... తల్లితండ్రులకు కుమారుడిని దూరం చేసి వారి కుటుంబానికి క్షోభ పెడుతున్నారన్నారు. నాలుగేళ్లు పాటు కనీసం కేసును పట్టించుకోలేదు, నాలుగేళ్ల తరువాత కేసు విచారణ సరిగా జరగలేదంటూ కోర్టులో పిటీషన్ వేసారని విమర్శించారు. ఇకనైనా కోడి కత్తి కేసులో జనాన్ని మభ్యపెట్టే ప్రయత్నాలు మానుకోవాలని సుంకర పావని తిరుమల కుమార్ హితవు పలికారు.

తానేటి వనితను ఎమ్మెల్యేగా గెలిపిస్తాం..

దేవరపల్లి,మేజర్న్యూస్ : రాబోయే ఎన్నికలలో తానేటి వనితను ఎమ్మె ల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రికి కానుకగాఇస్తామని గోపాలపురం ఏఎంసి డైరెక్టర్ సాలివేణు అన్నారు. గోపాలపురం నియోజకవర్గం ఇంచార్జ్‌గా తానేటి వనిత నియమితులైన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ రాబోయే ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో గెలవాలని కోరుకుంటూ గౌరీపట్నం నిర్మలగిరి మేరీ మాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి 101 కొబ్బరికాయలు కొట్టి 165 మెట్లను మోకాళ్ళపై ఎక్కి మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా శాలి వేణు మాట్లాడుతూ దేశంలో రామాలయం లేని ఊరే లేదన్నట్లు రాష్ట్రంలో జగనన్న సంక్షేమ పథకం చేరని ఇల్లే లేదని ప్రజా సంక్షేమ పాలనలో దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరొకసారి ముఖ్యమంత్రి కావాలని, గోపాలపురం నియోజకవర్గంలో తానేటి వనిత, కొవ్వూరు నియోజకవర్గంలో తలారి వెంకట్రావు అత్యధిక మెజార్టీతో గెలవాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాప్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, చిట్టేటి కిషోర్, ఐ.ఆర్. కె, చాపల రమణ, కోనాల కిరణ్, కొడమంచిలి విజయ్ కుమార్ ,నల్లజర్ల ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

చింతూరు, మేజర్ న్యూస్ : రంపచోడవరం నియోజకవర్గం చింతూరు మండలంలో ఏజీ కోడేరు సచివాలయ పరిధిలో ఏజీ కొడేరు, మల్లితోట, చట్టి సచివాలయం పరిధిలో వీరాపురం, చట్టి గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి పాల్గొన్నారు. గ్రామలలో ప్రతి ఇంటికి వెళ్లి ఈ నాలుగు సంవత్సరాలు కాలంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఆయా పథకాల ద్వారా లబ్ధిదారులకు నగదు ఎంత వచ్చిందో కూడా తెలియజేశారు. రానున్న కాలంలో కూడా ఈ సంక్షేమ పథకాలను మరింత పకడ్బందీగా అమలు చేస్తామని తెలియజేశారు. అర్హత ఉండి, సంక్షేమ పథకాలు అందని వారికి సరిచేసి, అర్హులైన వారందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకో వాలని అధికారులను ఆదేచించారు. గ్రామాల్లో ఉన్న సమస్య లను అడిగి తెలుసుకొని, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చింతూరు మండల కన్వీనర్, ఎంపీపీ, జడ్పిటిసి, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, సొసైటీ ప్రెసిడెంట్, వివిధ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్, కోఆప్షన్ నెంబర్, వైస్ సర్పంచులు, వార్డ్ మెంబర్లు, సచివాలయం కన్వీనర్లు గృహసారథులు, ఎక్స్ సర్పంచ్లు, ఎక్స్ ఎంపిటిసిలు, ప్రజా ప్రతిని ధులు,వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరామగిరి రామాలయంలో ప్రత్యేక పూజలు -అర్చకులు సౌమిత్రి

వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ : శ్రీరామగిరి రామాలయంలో అయోద్య రామమందిరంలో శ్రీరాముని విగ్రహా ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకుని నేడు శ్రీరామగిరి రామాలయంలో మధ్యాహ్నం12 గంటల8 నిముషా లకుశ్రీరామ సోస్త్రం,పారాయణం, దీపాలంకరణ కార్యక్రమాలు గుట్టపై నిర్వహించడం జరుగుతుంది. ఆలయ అర్చకులు పురుషోత్తమ చార్యులు,తెలిపారు.ఆదివారం ఆలయ చైర్మన్ రేవు బాలరాజు,(బాలయ్య)తో కలిసి ప్రెస్ నోట్ విడుదల చేశారు.భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజలు చేసుకోవాలని సూచించారు.వేదమంత్రాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని వివరించారు. అయోద్య రామమందిర విశిష్టతను వివరిస్తామని,భక్తులు శ్రీరాముని విశిష్టతను విని తరించాలని కోరారు.ఈఅద్భుతమైన అవకాశాన్ని మండల ప్రజలు భక్తిభావంతో ఉపయోగించు కోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ప్రెస్ నోట్ విడుదల చేసిన వారిలో ఆలయ కార్యనిర్వాహణాధికారి లక్ష్మీ కుమార్,ఆలయ సిబ్బంది, శ్రీరామగిరి, గ్రామపురప్రముఖులు,పెద్దలు, తదితరులు హాజరయ్యారు.

గాంధీనగర్ శాఖా గ్రంధాలయంలో 'చదవటం మాకిష్టం.. సండే స్టోరీ టైం' కార్యక్రమం

కాకినాడ, మేజర్ న్యూస్ : తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని కాకినాడ వివేకానంద పార్క్ లో గల గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో ఆదివారం నాడు 89వ వారం పాఠశాల విద్యార్థులతో చదవటం మాకిష్టం సండే స్టోరీ టైం కార్యక్రమం నిర్వహించడం జరిగిందని లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ నగరంలోని పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎన్.రామ్ చరణ్ భేతాళ కథలు అనే కథను, కె.కీర్తి హితోపదేశ అనే పుస్తకమును, కె.సూర్య వరుణ్ బాలల పంచతంత్ర కథలు అనే పుస్తకమును చదవటం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ములంపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు గ్రంథాలయంలో నిర్వహించే చదవటం మాకిష్టం సండే స్టోరీ టైం కార్యక్రమం యొక్క ఆవశ్యకతను వివరించడం జరిగింది.

యధాతధంగా స్పందన

– కలెక్టర్ డా కే.మాధవీలత

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా, డివిజన్, మండల స్థాయి స్పందన కార్యక్రమం జనవరి 22 సోమవారం యధావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. కె. మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో, అదేవిధంగా డివిజన్ స్థాయిలో ఆర్డీవో, మునిసిపల్ స్థాయి లో కమిషనర్లు, మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి, గ్రామ, వార్డు సచివాలయాల నుంచి ప్రజలు నుంచి సంబంధిత సిబ్బంది స్పందన అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ఉదయం 10.00 నుంచి మ.1.00 వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ, మునిసిపల్, మండల, గ్రామ, వార్డు సచివాలయాలలో స్పందన ఫిర్యాదులు అంద చేయాలని కలెక్టర్ తెలియచేశారు. మండల స్థాయి అధికారులు అందరూ మండల ప్రధాన కేంద్రంలో ఒకే చోట హాజరై ప్రజల నుంచి స్పందన అర్జీలు స్వీకరించాలన్నారు.

శ్రీరామ నామంతో మారుమ్రోగిన యాగశాల

కాకినాడ,మేజర్న్యూస్ :అయోధ్యలో శ్రీరామవిగ్రహ ప్రతిష్టా కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగాలన్న ఆశయంతో ఉత్తరాధి మఠాధీశులు శ్రీసత్యాత్మతీర్థ స్వామీజీ ఆశీర్వచనంతోరెండురోజులపాటు నిర్వహించిన లక్ష శ్రీరామ నామజప మరియు హోమ కార్యక్రమం స్థానిక గొడారిగుంట జర్నలిస్ట్ కాలనీలో వేంచేసియున్న శ్రీసత్యదేవ మందిర ప్రాంగణంలో ఘనంగాజరిగాయి.మాధ్వపురోహితులు యాతగిరి మధ్వేష్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల నుండి మాధ్వగృహస్థుల సహకారంతో లక్ష శ్రీరామ నామజప మరియు హవన కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది.కాకినాడ మధ్వసభ కమిటి అధ్యక్షులు రాచూరి రాఘవేంద్రస్వామిమాట్లాడుతూగురుదేవుల ఆశీర్వచన బలంతో ఈ రెండు రోజుల కార్యక్రమం విశేషంగాను నిర్వహించడమే కాక మాధ్వగృహస్థులందరినీ భాగస్వాములను చేయడం గొప్ప విషయంగా కొనియాడారు. కమిటి సంయుక్త కార్యదర్శి డా.యాతగిరి పరశురామ్ మాట్లాడుతూ త్రేతాయుగంలో శ్రీరాములవారిని దర్శించుకున్న భక్తులు నేడు ఈ ప్రతిష్టా కార్యక్రమం ద్వారా తిరిగి ఆఅదృష్టాన్ని పొందడం అంటే పూర్వజన్మ సుకృతమేనని అన్నారు.ఈక్రతుకార్యక్రమంలో మనమందరం భాగస్వాములం అవడం మన పూర్వీకులు చేసుకున్న పుణ్యఫలమే అని ప్రస్తావించారు. ఎవరికీ లభించని ఇంతటి అదృష్టం నేటి తరానికి కలిగిందంటే శ్రీరాముని అనుగ్రహంగా పేర్కొన్నారు. ఈ

రెండు రోజులపాటు పాల్గొన్న మాధ్వగృహస్తులందరినీ శ్రీరామ నామ కండువాతో యాతగిరి మధ్వేష్ సత్కరిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ద్వారాభగవంతుని అనుగ్రహంతో పాటు గురువుల ఆశీర్వచనాలుకూడాపొందినవారు అయ్యారని కొనియాడారు. ఈ సందర్భంగా శ్రీరామ నామ నినాదాలతో శోభాయాత్రను కూడా నిర్వహించడంతో ఆధ్యాత్మికవాతావరణం మరింతగా శోభాయమానంగా మారింది. రాచూరి రాఘవేంద్రస్వామి దంపతులతో పాటు మాధ్వగృహస్థులు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత వారణాసి నుండి తీసుకొచ్చిన శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయ సహిత పంచలోహ మూర్తులతో పాటు శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి వార్లకు ప్రత్యేకపూజలనుయాతగిరిమధ్వేష్ నిర్వహించారు.కార్యక్రమం లో మధ్వసభ కమిటీ ఉపాధ్యక్షులు తాడూరి రంగారావు, కార్యదర్శి కోపల్లె శేషగిరిరావు, కార్యవర్గసభ్యులు రాచూరి శేషగిరిరావు, జాగిర్దార్ ప్రేమ్‌కుమార్,ఉదయగిరిశేషగిరిరావు, టంకశాల సత్యనారాయణమూర్తి, ఓఎన్జిసి మురళి, శ్రీనివాసరావు, రాజమండ్రి వాస్తవ్యులు, ప్రముఖ న్యాయవాది న్యాపతి రవీంద్ర వెంకోబరావు, మధ్వసభ ఆచార్యులు పరశురామాచార్, దాససాహిత్యకమిటిప్రతినిధిమనోజ్ఞ, వ్యాసరామ మూర్తి, కాళ్ళూరి రవీంద్ర, బారు గోవిందు, పన్యాల నరసింహారావు (బుజ్జి),యాతగిరిరఘోత్తమతో పాటు అధిక సంఖ్యలో మాధ్వగృహస్తులు పాల్గొన్నారు

అయోధ్య రామాలయ ప్రారంభం సందర్భంగా అన్నవరప్పాడులో భారీ అన్నసంతర్పణ

పెరవలి, మేజర్ న్యూస్ : అయోధ్యలో రామాలయం ప్రారంభం సందర్భంగా జనవరి 22వ తేదీ సోమవారం తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలంఅన్నవరప్పాడు గ్రామంలో జాతీయ రహదారి ప్రక్కన సెంటర్లో ఉదయం 10 గంటల నుంచి సత్య రాజధాని కాటా దగ్గర రకరకాల పిండి వంటలతో గొప్ప బ్రహ్మాండమైన అన్న సమారాధన కార్యక్రమం జరుగుతుందని కమిటీ వారు తెలియజేశారు. రామాలయ ప్రారంభనానికి సన్నాహకంగా పెరవలి మండలంలో వివిధ గ్రామాల్లో హిందూ భక్తుల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి శ్రీరాములు వారి జండాలను దీపారాధన కొరకు ప్రమిదలను పంపిణీ చేశారు. పెరవలి మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం పూట ప్రతి ఆలయంలో భజనలు కోలాటాలు దీపారాధనలు నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు. ప్రతి గ్రామ కూడలి లు వద్ద శ్రీరాముని భారీ కటౌట్లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పండుగ కళ వచ్చిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సన్నాహకంగా జనవరి 21వ తేదీ ఆదివారం పెరవలి మండల వ్యాప్తంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

నేడు ఆర్డీఓ కార్యాలయంలో ప్రజా స్పందన

పెద్దాపురం,మేజర్ న్యూస్ : పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా స్పందన కార్యక్రమం నిర్వహించబడునని, ఆర్డీఓ కార్యాలయం ఒక ప్రకటనలో భాగంగా తెలిపింది. దీనిలో భాగంగా సోమవారం ఉదయం 10 గంటల నుండి ప్రజా స్పందన కార్యక్రమం డివిజన్‌లోని 11 మండలాల పరిధిలో గల అర్జీదారులు ప్రజా స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆర్డీఓ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది

జైశ్రీరామ్ అంటూ ఓరెత్తిన ఏలేశ్వరం పట్టణం

ఏలేశ్వరం,మేజర్న్యూస్: అయోధ్య రామ మందిరంలో సోమవారం రాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఏలేశ్వరం పట్టణ పురవీధుల్లో ఆదివారం జైశ్రీరామ్ అంటూ నినాదాలతో మారుమ్రోగిపోయింది. విశ్వ హిందు పరిషత్ సభ్యులు ఉదయం ప్రతి షాపుకు హనుమాన్ జండాలు కట్టి భారీ ర్యాలీ నిర్వహించారు. పలు భజన సంఘాలు ముఖ్యంగా మహిళలతో కీర్తనలను ఆలాపిస్తూ వీధుల గుండా జైశ్రీ రామ్ అంటూ తమ రామభక్తిని చాటుకున్నారు. వివిధ కూడళ్ళవద్ద వీరికి అల్పాహారంతో పాటుమజ్జిగవంటివి స్థానికులు అందజేశారు.

హనుమాన్ ఆలయం వద్ద అన్నదానం

ఏలేశ్వరం,మేజర్న్యూస్: శ్రీ సంజీవని ఆంజనేయ స్వామి వారి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణం జరిగి ఇప్పటికి 20 సంవత్సరాల అయిందని, ప్రతి సంవత్సరం స్వామివారి వార్షికోత్సవం ముగింపు సందర్భంగా దాతల సహకారంతో అన్న సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ అన్న సమర్పణలో 2000 మంది అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కంచర్ల సత్తిబాబు , మండ శ్రీనివాస్, మండ వీరేష్, కంచర్ల రమేష్, పిరాట్ల రాజా, గ్రంధి రామకృష్ణ, రేపాక రామలింగేశ్వరరావు (బాపన మందుల షాప్), పిరాట్ల విస్సు, పిరాట్ల రవి, బాదం సతీష్, పసుపులేటి శ్రీను, తాడిపత్రి జగన్, కుమార్ బేకరీ, తదితరులు భక్తులకు సహాయ సహకారాలు అందించారు.

చేబ్రోలులో శ్రీరామ శోభాయాత్ర రామనామ స్వర్ణతో మారు మ్రోగిన చేబ్రోలు

గొల్లప్రోలు,మేజర్న్యూస్ : భారతదేశంలో ఉత్తరప్రదేశ్ అయోధ్య నగరంలో బాల రాముని విగ్ర ప్రాణప్రతిష్ట సందర్భంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో అయోధ్య నగరంలో సోమవారం అయోధ్య ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో పవిత్రమైన సాలిగ్రామ శిలతో రూపొందించిన శ్రీరామ బాల విగ్రహ ప్రాణ ప్రతిష్ట పుష్కరించుకుని స్థానిక విశ్వహిందూ పరిషత్ సభ్యులు గొల్లప్రోలు జడ్పిటిసి ఉలవకాయల నాగలావరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఎక్కువ జాము నుండి మెయిన్ రోడ్‌లో ఉన్న శ్రీ హనుమాన్ విగ్రహం వద్ద నుండి శ్రీరామ నామస్వరనతో చేబ్రోలు ఉన్నటువంటి 15 రామ మందిరాలను భక్తిశ్రద్ధలతో భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు

ఈ సందర్భంగాగొల్లప్రోలు జడ్పిటిసి నాగలావరాజు విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఇలా ప్రసంగించారు శ్రీరాముడు అంటే ఒక ఆదర్శం మూర్తి లోకాభిరాముడు ఉనికి భారత్ దేశంలోనే కాక విదేశాలలో కూడా నేపాల్ మంగోలియా రష్యా మైనమార్ ఇలా అనేక దేశాలలో శ్రీరాముడను అక్కడి ప్రజలు ఇప్పటికీ ఆదర్శంగా తీసుకుంటారని గొల్లప్రోలు జడ్పిటిసి ఉలవకాయ నాగలావరాజు భక్తులకు ప్రజలకు వివరించారు..

ఎ.యమ్.రత్నం గారికి ఘన సన్మానం..

రాజమహేంద్రవరం,ఫిలిం మేజర్న్యూస్ : తెలుగు చిత్ర పరిశ్రమలో ఎన్నో సూపర్, డూపర్ హిట్ చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు పొందిన ఎ.యమ్.రత్నంగారికి ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా ఆయన నెల్లూరు జిల్లా వాసి కావడంతో, నెల్లూరు జిల్లాకు చెందిన నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, కళాకారులు నెల్లూరు నగరంలోని టౌన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ కమిటీ సభ్యులకు, ఆయనకు ఘన సన్మానం చేసి చిత్ర పరిశ్రమలో ఆయన గొప్పతనాన్ని కొనియాడారు.. కార్యక్రమంలో ఛాంబర్ తరుపున కళాంజలి కె.అనంత రావును నెల్లూరు జిల్లా కోఆర్డినేటర్‌గా నియమించారు.. కార్యక్రమంలో అధ్యక్షులు ఎ.యమ్.రత్నం గారు మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో నేను జన్మించినందుకు అదృష్టంగా భావిస్తున్నానని , మీ అందరి అభిమానానికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని, మున్ముందు చిత్ర పరిశ్రమలో ఇంకా ఎన్నో విజయాలు సాధించాలని కృషి చేస్తున్నానని తెలిపారు.. ఛాంబర్ కార్యదర్శి జె.వి.మోహన్ గౌడ్ మాట్లాడుతూ తెలుగు చిత్ర పరిశ్రమలో నెల్లూరు జిల్లాకు ఎంతో ప్రాముఖ్యత ఉందని,నెల్లూరు జిల్లా నుంచి పేరు మోసిన కళాకారులు, నిర్మాతలు,దర్శకులు ఎందరోఉన్నారని,మహా గాయకుడిగా ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన ఎస్పీ. బాలసుబ్రమణ్యం నెల్లూరు జిల్లాకు చెందిన వాడని గుర్తు చేశాడు.. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి అందరం కలిసి కట్టుగా పని చేయాలని పిలుపు నిచ్చారు.

. ఇంకా కార్యక్రమంలో ఛాంబర్ ట్రెజరర్ యం.శ్రీనాధ రావు, వైస్ ప్రెసిడెంట్ మంతా శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ పి. రమణా రెడ్డి, EC మెంబర్లు PDR ప్రసాద్ రెడ్డి, మిత్తాన ఈశ్వర్ రావు, ఛాంబర్ మాజీ EC మెంబర్ డిస్ట్రిబ్యూటర్ డి.ప్రభాకర్ రావు , గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ బి.పిచ్చి రెడ్డి, నెల్లూరు జిల్లా చిత్రపరిశ్రమకు చెందిన ఎందరో పాల్గొన్నారు..

జాతీయస్థాయి రేలా పండగ నిర్వాహక కమిటీ ఏర్పాటు

– ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం

చింతూరు, మేజర్ న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలో ఆదివారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం ఎస్ఎంఎస్ హాస్టల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా చింతూరు డివిజన్ అధ్యక్షులు కారం రవిమాట్లాడుతూ ఫిబ్రవరి 9,10,11న జరిగే జాతీయస్థాయి రేల పండగ విజయవంతం చేయాలని రేల పండగను వీక్షించే సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ఆదివాసులకు అన్ని విధాలుగా సౌకర్యం కల్పించాలని రేల పండగ నిర్వహణ కమిటీ ఎన్నిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ జాతీయ ప్రధాన కార్యదర్శి సున్నం వెంకటరమణ రేల పండగ స్టేజిని పరిశీలిస్తూ రేల పండగ పనులు వేగవంతం చేయాలని ఆదివాసి నాయకులకు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సున్నం వెంకటేశ్వర్లు, అడ్వకేట్ మడివి రవితేజ, ఆదివాసి టీచర్ అసోసియేషన్ కారం చంద్రరావు, పూణెం బాబురావు, బాబు శ్రీను, ఆదివాసి ఉద్యోగ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూసం శ్రీను, ఆదివాసి సంక్షేమ పరిషత్తు చింతూరు డివిజన్ నాయకులు మినప నాగేశ్వరావు, మల్లం ఆనంద్,కారం కన్నారావు, మిడియం రమణమ్మ, కూర నారాయణ, సరియం రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ స్టార్ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ద్వారా ఎంతోమందికి సహాయం అందించాం

– ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ కరుణ్ రాజ్



పిఠాపురం, మేజర్ న్యూస్ : లిటిల్ స్టార్ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ఎంతోమందికి సహాయం అందించామని ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ కరుణ్ రాజ్ తెలిపారు. స్థానిక సూర్యరాయ గ్రంథాలయం యందు ఆదివారం రిజిస్టర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తూ... విశిష్ట సేవా పురస్కార ప్రధానోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా డాక్టర్ సాల్మన్ రాజు, డాక్టర్ విజయ్ శేఖర్ పాల్గొన్నారు. కరోనా సమయంలో కూడా ఎంతో మందికి తమ సహాయ సహకారాలు అందించిన వ్యక్తిగా కరుణ్ రాజును ఎంతోమంది ప్రశంసించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ కరుణ్ రాజ్ మాట్లాడుతూ... తాను ఎదుర్కొన్న ఎన్నో సమస్యల నుండి వచ్చిన ఆలోచన ఈ లిటిల్ స్టార్ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ అని, ఒకానొక సమయంలో తనకి సహాయ సహకారాలు అందించడానికి ఎవరు కనిపించలేదని, అలాంటి సమయంలో ఆపదలో ఉన్న ఎంతో మందికి ఏ విధంగా సహాయ పడగలమని ఆలోచించినప్పుడు వారికి సహాయం చేయగల వ్యక్తులను వారికి చూపించడం ద్వారా వారి సమస్యను పరిష్కరించుకోవచ్చు అని అనుకున్నానని అన్నారు. తద్వారా ముందుగా సేవా కార్యక్రమాలు ప్రారంభించడం జరిగిందని, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో... వివిధ సందర్భాలలో తనకు చేతనైన సహాయాన్ని అందిస్తూ... వచ్చానని, తర్వాత లిటిల్ స్టార్ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ రిజిస్టర్ చేసుకుని ఈ సంవత్సరం ప్రథమ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం అన్నది ఎంతో సంతోషకరంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో విశిష్ట సేవలు అందించిన వారికి విశిష్ట సేవ పురస్కారాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ,డాక్టర్. సి.హెచ్.శాంషన్ , పెన్సనర్ అసోషియేషన్ ప్రెసిడెంట్ డి.కోదండరామయ్య, కె.వి.యస్.యస్.ప్రసాద్ మాష్టర్, కె.అప్పారావు,కొండెపూడి శంకర్రావు, అల్లవరపు నగేష్, యం.ఎలీయా, కె.శ్యామ్ సుందరం, వెన్నపు చక్రధర్ రావు ,తదితరులు పాల్గొన్నారు.

దళితద్రోహి జగన్ అంటూ గోరంట్ల విమర్శలు

రాజమహేంద్రవరం రూరల్, మేజర్ న్యూస్ : రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి మరలా అధికారం చేపడితే రాష్ట్రంలో దళిత జాతే అంతరించిపోతుందని దళిత ద్రోహి జగన్మోహన్ రెడ్డి అని టిడిపి పోలీట్ బ్యూరో సభ్యులు రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఆదివారం శాసనసభ్యులు గోరంట్ల నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తుగ్లక్ పాలన సాగుతుందని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అరాచక అక్రమాలను ప్రశ్నిస్తే ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు బనాయించి వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని జగన్మోహన్ రెడ్డి అధికారం కోసం ఎంతకైనా తెగిస్తాడని ముఖ్యమంత్రి పదవి కోసం ఒక అమాయక దళిత యువకుడు జనపల్లి శ్రీను ని అడ్డుపెట్టుకుని కోడి కత్తితో దాడి చేయించుకుని దానిని తన అధికారం కోసం వాడుకున్న దుర్మార్గుడు జగన్మోహన్ రెడ్డి అని గోరంట్ల తీవ్రంగా మండిపడ్డారు. దళిత గిరిజన వాడల్లో ఎక్కడా కూడా కనీసం రోజు సౌకర్యానికి కూడా నోచుకోలేదని, వారి సంక్షేమము, అభివృద్ధి అటు ఉంచితే వైసీపీ ప్రభుత్వంలో తీవ్రమైన దాడులు ఎదుర్కొన్నది దళితులు, గిరిజనులేనని అన్నారు. ఎమ్మెల్సీ ఆనంద్ బాబు హత్య చేసి డోర్ డెలివరీ చేస్తే మూడు నెలల్లో బెయిల్ మంజూరయిందని, శీను దళితుడు కావడం చేతనే సంవత్సరాలు తరబడి వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు.బయటకు వస్తే నిజాలు బయటపడతాయన్న భయంతోనే జగన్ రెడ్డి శీను పై వేధింపులకు పాల్పడుతున్నారని వైసిపి పాలనలో సుమారు 200 మంది దళితులు హత్య చేయబడ్డారని, ప్రస్తుతం ఎనిమిది మంది వైసీపీ దళిత అభ్యర్థులను స్థానచలనం చేస్తూ దళితులను నాయకత్వం నుంచి కూడా దూరం చేస్తున్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించి దళితులకు తీవ్ర అన్యాయం చేసిందని 27 దళిత పథకాలను జగన్మోహన్ రెడ్డి రద్దు చేశారని 400 కోట్లతో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసి వేలాది వాహనాలు లో ప్రజలను విజయవాడకు తరలిస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి దళితుల పట్ల చిత్తశుద్ధి లేదుని దళితులకు తీవ్ర అన్యాయం చేసి ఎన్నికల ముందు ప్రలోభాలకు గురి చేసేందుకే అంబేద్కర్ స్మృతి వనం ఏర్పాటు చేస్తున్నారని, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పేరు చెప్పుకునే యోగ్యత కూడా జగన్ రెడ్డికి లేదని గోరంట్ల అన్నారు. ఇక తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు గారి రా కదిలిరా సభకు ప్రజల నుండి అనూహ్య స్పందన వస్తుందని రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి ఒక్కరూ ఇబ్బందులు పడుతున్నారని వైసీపీ ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, క్రిస్మస్ కానుకలను,రంజాన్ తోఫాలను వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టిందని గోరంట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని గోరంట్ల అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి జల్లి కృపారావు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు యర్రమోతు ధర్మరాజు,ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు తలారి మూర్తి, రాయుడు సునీల్, అనంతారపు గోపి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో నీలి కుటుంబ సభ్యులు

విఆర్.పురం, మేజర్ న్యూస్ : మల్లూరు లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో నీలి అప్పల రాజు, కుటుంబం పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అందరూ బాగు ండాలి అందులో మనము ండాలని కోరుకునే కుటుంబం అరుదుగా ఉంటుంది. కానీ నీలి కుటుంబానికి సహాయం చేయడమే కానీ అపకారం ఎరుగని ఏకైక కుటుంబం "నీలి" కుటుంబం,కుటుంబ సభ్యులతో లక్ష్మీ నరసింహ స్వామి గుడికి వెళ్లి దర్శనం చేసుకున్నారు. తనకు జన్మనిచ్చిన ఊరి కోసం ఎన్నో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తూ ఆ మండల ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారు. ఏది ఏమైనా నీలి కుటుంబానికి భగవంతుడి ఆశీస్సులు ఉండాలని కోరుకుందాం..!

వైయస్సార్ పార్టీకి సలాది సందీప్ కుమార్ రాజీనామా ప్రకటన

కొవ్వూరు, మేజర్ న్యూస్ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పుగోదావరి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు సలాది సందీప్ కుమార్ తన పదవికి మరియు పార్టీకి రాజీనామా చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజాకు పంపినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తను పార్టీలో జాయిన్ అయినప్పటి నుంచి పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశానని అన్నారు. ఈ క్రమంలో తనకు సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. వ్యక్తిగత కారణాలవల్ల పార్టీని విడనున్నట్లు ఆయన తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

శ్రీరామచంద్రమూర్తి సైకత శిల్పం

– అయోధ్య రాముని ఆగమనం... అవనికే ఆనందమయం

– సైకత శిల్పి దేవిన శ్రీనివాస్

కాకినాడ, మేజర్ న్యూస్ : అయోధ్యలో శ్రీరామచంద్రమూర్తి విగ్రహ ప్రాణ ప్రతిష్ట వేళ మన దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు శ్రీరామచంద్రునిపై తమకున్న భక్తి విశ్వాసాలను చాటుకుం టున్నారు. వాడవాడలా ఎక్కడ చూసినా శ్రీరామనామ సంకీర్తనం వినవస్తోంది. అయోధ్య రాముని ఆగమనం అవనికే ఆనందమయంగా మారింది. 22వ తేదీ సోమవారం అయోధ్యలో శ్రీరాముని ప్రణ ప్రతిష్ట సంధర్భంగా రంగంపేటకు చెందిన సైకతశిల్పి దేవిన శ్రీనివాస్ శ్రీరామచంద్రమూర్తి సైకత శిల్పాన్ని రూపొందించారు. అయోధ్య రాముని ఆగమనం...అవనికే ఆనందమయం. అన్న నినాదంతో ఈ సైకత శిల్పం రూపొం దించినట్లు శిల్పి తెలిపారు.

నేడు ఓటరు జాబితా తుది ప్రచురణ విడుదల

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఆర్డీఓ మరియు ఈఆర్వో జె.సీతారామారావు ఒక ప్రకటనలో భాగంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనవలసినదిగా తెలిపారు. అనంతరం ఓటరు జాబితా తుది ప్రచురణ విడుదల చేయడం జరుగుతుందని ఈఆర్వో ప్రకటించారు.